సాక్షి
కుమురం భీం
శనివారం 3 జూన్ 2023


అమరవీరులకు నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ సుంకరి రాజు

గరిష్టం/కనిష్టం 42.8/29.5

**వాతావరణం**
ఆకాశంలో అక్కడక్కడ మబ్బులు ఉంటాయి. ఎండ తీవ్రత కొనసాగుతుంది. మధ్యాహ్నం తర్వాత వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్

### జంబుగా @ 45.6 డిగ్రీలు

తిర్యాణి(ఆసిఫాబాద్): జిల్లాలో మూడు రోజులుగా ఎండలు దంచికొడుతున్నాయి. పలు ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకున్నాయి. వడగాలులు, వేడితో ప్రజలు అల్లాడుతున్నారు. శుక్రవారం కాగజ్‌నగర్ మండలం జంబుగాగ్రామంలో 45.6 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా, దహెగాం మండలం కుంచవెల్లిలో 44.7, తిర్యాణిలో 43.9, చింతలమానెపల్లి మండలం రవీంద్రనగర్‌లో 43.3, బెజ్జూర్‌లో 42.9 డిగ్రీలుగా నమోదైంది. మరో రెండు రోజులపాటు ఇదే పరిస్థితి ఉండొచ్చని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు.

### సీడీ ఆవిష్కరణ


సీడీ ఆవిష్కరిస్తున్న సుంకరి రాజు, తదితరులు

ఆసిఫాబాద్: జిల్లాకు చెందిన కవి మడావి ఇస్రు రచించిన తెలంగాణ సంబురాల పాట సీడీని కలెక్టర్ హేమంత్ బోర్కడే, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, కోనేరు కోనప్పతో కలిసి ప్రభుత్వ విప్ సుంకరి రాజు శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీపీఆర్‌వో కృష్ణమూర్తి, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు పాల్గొన్నారు.

### 8 నుంచి సదరం క్యాంపులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ నెల 8 నుంచి 27 వరకు సదరం క్యాంపులు నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీవో సురేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. 8న కంటి చూపు, 12న మూగ, చెవిటి, 22న ఎముకలు, 27న మానసిక వైకల్యం పరీక్షలు నిర్వహిస్తారని వెల్లడించారు. శిబిరానికి హాజరయ్యేవారు సంబంధిత ప్రాథమిక ఆరోగ్య సేవా కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. స్లాట్ బుక్ చేసుకున్న తర్వాతే దివ్యాంగులు క్యాంపులకు రావాలని సూచించారు.

### 6న మున్సిపల్ అద్దె గదులకు వేలం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపల్ వాణిజ్య అద్దె గదులకు ఈ నెల 6న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన 9 వాణిజ్య అద్దె గదులకు సంబంధించి మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు శనివారం సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రూ.25వేల ధరావత్తు డీడీ రూపంలో చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని వివరించారు.

### 'బీజేపీ మద్దతుతోనే తెలంగాణ'


మలిదశ ఉద్యమంలో పనిచేసిన జర్నలిస్టులను సన్మానిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: పార్లమెంట్‌లో బీజేపీ మద్దతుతోనే ప్రత్యేక తెలంగాణ సాధించుకున్నామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం తెలంగాణ ఆవిర్భావ సంబురాలు జరుపుకొన్నారు. ముందుగా జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం మలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న ఉద్యమకారులు, ఉద్యమ స్ఫూర్తితో పనిచేసిన జర్నలిస్టులను శాలువాలతో సన్మానించారు. మృతి చెందిన ఉద్యమకారులకు నివాళులర్పించారు. కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ 1200కు పైగా విద్యార్థుల ఆత్మ బలిదానాలతో తెచ్చుకున్న తెలంగాణలో ఉద్యమకారులకు గుర్తింపు లభించలేదన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. తెలంగాణ కోసం ఆమరణ దీక్ష చేసిన ఉద్యమకారుడు గడ్డల సత్తయ్య, అప్పటి ఉద్యమ జేఏసీ కన్వీనర్ రేగుంట కేశవరావు మాదిగ, ఉద్యమకారులు గుర్రాల వెంకటేశ్వర్లు, గుర్రాల హరిప్రియ, సుప్రజ, లలిత, సాలమ్మ, షర్ఫొద్దీన్, సూత్రాల రవి, సీహెచ్ రవి, జాడె అశోక్, ఆత్మకూరి చిరంజీవి, పొన్నాల నారాయణ, ఎండీ గౌస్, జర్నలిస్టులు వి.గిరీశ్‌కుమార్, రావుల శంకర్, డి.సతీశ్ కుమార్, ఎస్.వేణుగోపాల్, బాల శ్రీనివాస్, కృష్ణంరాజు, భాస్కరాచారి, వంశీకృష్ణ, దాసరి సురేశ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు మురళీధర్, శ్రీశైలం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆత్మారాం నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు చక్రపాణి, ప్రభారి సత్యనారాయణ, అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి, నాయకులు జయరాజ్, శ్రీనివాస్, సుచిత్ తదితరులు పాల్గొన్నారు.

# సమష్టి కృషితో అభివృద్ధి


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ సుంకరి రాజు




విద్యార్థినుల నృత్య ప్రదర్శన

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ సుంకరి రాజు
- అమరవీరులకు నివాళులు
- జాతీయ జెండా ఆవిష్కరణ
- ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

ఆసిఫాబాద్: సమష్టి కృషితో జిల్లా అభివృద్ధి జరుగుతోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ సుంకరి రాజు అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాడి తొమ్మిదేళ్లు పూర్తి చేసుకుని, పదో ఏడాదిలోకి అడుగుపెడుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న దశాబ్ది వేడుకలను అట్టహాసంగా ప్రారంభించారు. శుక్రవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, ఆత్రం సక్కు, ఎస్పీ సురేశ్‌కుమార్, పద్మశ్రీ అవార్డు గ్రహీత కనక రాజు, అదనపు కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, రాజేశంతో కలిసి అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతీయ జెండా ఆవిష్కరించారు. మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకుముందు పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

**సంక్షేమం.. అభివృద్ధే ధ్యేయం**

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం ప్రజల అభిరుచి, ఆకాంక్షల మేరకు ఎన్నో పథకాలు చేపట్టిందని ప్రభుత్వ విప్ సుంకరి రాజు అన్నారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ స్వల్ప కాలంలోనే అత్యంత ప్రగతిశీల రాష్ట్రంగా రూపుదిద్దుకుందన్నారు. తెలంగాణ ఆచరిస్తుంది.. దేశం అనుసరిస్తుంది అని చెప్పుకునే స్థాయికి రాష్ట్రం చేరుకోవడం ప్రజలందరికీ గర్వకారణమన్నారు. అభివృద్ధి పథంలో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అత్యంత వేగంగా ముందుకు సాగుతుందని పేర్కొన్నారు.

**గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా రూ.792.60 కోట్ల రుణాలు..**

జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా 7,958 స్వశక్తి మహిళా సంఘాల్లోని 88,140 సభ్యులకు రూ.792.60 కోట్లు అందించామన్నారు. రూ.698 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. తెలంగాణకు హరితహారంలో భాగంగా 3 కోట్ల మొక్కలు నాటినట్లు తెలిపారు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిలో భాగంగా 2016 నుంచి 2023 వరకు 33 కళాశాలలోని విద్యార్థులకు రూ.7.47 కోట్లు పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌లు అందజేశామని తెలిపారు.

**చురుగ్గా వైద్యకళాశాల పనులు..**

కమ్యూనిటీ హెల్త్ సెంటర్, 30 పడకల ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసినట్లు ఆయన తెలిపారు. టీహబ్, ఆక్సిజన్ ప్లాంట్, ఎస్ఎన్‌సీయూ, ఆర్టీపీసీఆర్ ల్యాబ్, ఎన్‌సీడీ ట్రెయినింగ్, డెడికేటెడ్ పీడియాట్రిక్ యూనిట్ ఏర్పాటు చేసి సేవలందిస్తున్నామన్నారు. ప్రభుత్వ వైద్యకళాశాల ఏర్పాటుకు రూ.48 కోట్లు మంజూరు చేశామని, నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని తెలిపారు. 50 పడకల ప్రభుత్వాసుపత్రిని 330 పడకల ఆసుపత్రిగా మార్చేందుకు రూ.9.50 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించామని పేర్కొన్నారు.


కలెక్టరేట్‌లో జెండా ఆవిష్కరిస్తున్న సుంకరి రాజు

**గిరిజన సంక్షేమ శాఖ**

గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2016 నుంచి 2023 విద్యా సంవత్సరం వరకు 93,6837 మంది బాలబాలికలు విద్యనభ్యసించారని పేర్కొన్నారు. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద విదేశీ విద్యనభ్యసించే గిరిజన విద్యార్థులకు రూ.10 లక్షల ఆర్థికసాయం, రూ.60 వేలు వీసా, రూ.57 వేలు టికెట్ చార్జీలు మంజూరు చేసినట్లు వివరించారు. మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తొమ్మిదేళ్లలో 3,225 మంది మైనార్టీ విద్యార్థులకు రూ.3.32 కోట్ల ఉపకార వేతనాలు అందించామని చెప్పారు. ముఖ్యమంత్రి ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్ ద్వారా నలుగురికి రూ.82.40 లక్షలు అందించామని తెలిపారు. స్త్రీశిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 5 ప్రాజెక్టులు 834 అంగన్‌వాడీ కేంద్రాలు, 139 మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవలందిస్తున్నామని పేర్కొన్నారు. బీసీ సంక్షేమ శాఖ ద్వారా అర్హులైన అభ్యర్థులకు 2018–19లో 529 మందికి వందశాతం రాయితీతో రూ.50 వేల చొప్పున రూ.2.64 కోట్లు మంజూరు చేశామని వివరించారు.

**పంచాయతీరాజ్ శాఖ**

పంచాయతీరాజ్ శాఖ ద్వారా 250 రహదారుల అభివృద్ధికి రూ.150.24 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో 2022– 23లో 335 జీపీల్లో రూ.4.45 కోట్ల ఇంటి పన్నులు వసూలు చేశామని తెలిపారు. పౌర సరఫరాల శాఖ ద్వారా ప్రతినెలా 2,966 మెట్రిక్ టన్నుల బియ్యం 1,26,922 మంది రేషన్‌కార్డుదారులు, వసతిగృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేస్తున్నామన్నారు. మిషన్ భగీరథ పథకం కింద 3,274 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ వేసి, 1,26,106 ఇళ్లకు స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నామన్నారు. విద్యాశాఖ ద్వారా మన ఊరు– మన బడి కార్యక్రమం ద్వారా 251 పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇందుకోసం రూ.91 కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు.

ఈ సందర్భంగా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, జిల్లా సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో ఆలపించిన దేశభక్తి గీతాలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు, జెడ్పీటీసీలు అరిగెల నాగేశ్వర్‌రావు, అజయ్‌కుమార్, ఎంపీపీ మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, నాయకులు మల్లేశ్, వెంకన్న, వివిధ శాఖలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**రూ.200 కోట్ల పంట ఉత్పత్తులు కొనుగోలు..**

జిల్లాలోని మూడు వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారా 2014– 15లో నాబార్డు నిధుల రూ.42 కోట్లతో 70 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల 13 గోదాంలు నిర్మించామన్నారు. 12 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, 273 బలహీనవర్గాల సహకార సంఘాలు, 453 పరస్పర సహాయ సహకార సంఘాల ద్వారా రైతులకు రుణాలు, ఎరువులు, విత్తనాలు సరఫరా చేస్తూ, వరి, మక్కలు, జొన్నలు కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. గతేడాది సుమారు రూ.200 కోట్ల విలువైన పంట ఉత్పత్తులు కొనుగోలు చేసినట్లు తెలిపారు. జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా దశాబ్ద కాలంలో 215 పరిశ్రమలకు అనుమతులు జారీ చేసి రూ.767 కోట్ల పెట్టుబడితో 2,084 మందికి ఉపాధి కల్పించామన్నారు. 180 పరిశ్రమల్లో ఉత్పత్తి ప్రారంభించామని చెప్పారు.

**వ్యవసాయానికి పెద్దపీట**

వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. 24 గంటలు నిరంతరాయంగా ఉచిత విద్యుత్, సకాలంలో ఎరువులు, పురుగుల మందులు అందిస్తూ శాస్త్రవేత్తల ద్వారా సాగు మెలకువలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. రైతు బంధు పథకం కింద ఎకరానికి రూ.10 వేల చొప్పున 2018 నుంచి 2022 వరకు 1,12,693 మంది రైతులకు రూ.1,636.69 కోట్ల నగదు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. రూ.5 లక్షల జీవిత బీమా కల్పించి, రైతువేదికల ద్వారా నూతన వ్యవసాయ పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ పరిధిలో 2014 నుంచి 2023 వరకు సూక్ష్మ సేద్య పథకం ద్వారా 1,130 మంది రైతులకు రూ.2.35 కోట్ల విలువైన బిందు తుంపర సేద్యం పరికరాలను రాయితీపై అందించామని వెల్లడించారు.


అమరవీరుల స్తూపం వద్ద పూలు చల్లుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే


నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆత్రం సక్కు


అమరవీరుల స్తూపానికి నమస్కరిస్తున్న అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్


మహనీయుల ఫొటోలకు పూలమాల వేస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

## అమరుల త్యాగాల ఫలితమే ప్రత్యేక రాష్ట్రం

- ఎస్పీ సురేశ్‌కుమార్
- జాతీయ జెండా ఆవిష్కరణ
- 59 మందికి ప్రశంసాపత్రాలు అందజేత

ఆసిఫాబాద్‌అర్బన్: అమరుల త్యాగాల ఫలితంగానే ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిందని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం జరిగిన ఉద్యమంలో ఎంతో మంది అమరులయ్యారన్నారు. తెలంగాణ అభివృద్ధిలో పోలీసుశాఖ భాగస్వామ్యమవుతూ.. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. అమరుల త్యాగల స్ఫూర్తితో ప్రజలకు అంకితభావంతో సేవలందించాలని సూచించారు. అనంతరం స్థానిక చిల్డ్రన్స్ పార్క్‌లోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు.


జెండా ఆవిష్కరిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

**సిబ్బందికి ప్రశంసా పత్రాలు**

విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన 59 మంది పోలీసులకు ఎస్పీ సురేశ్‌కుమార్ ప్రశంసాపత్రాలు అందించారు. ప్రతీ ఉద్యోగి సహచర సిబ్బందికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీలు శ్రీనివాస్, కరుణాకర్, సీఐలు, ఎస్సైలు తదితరులు ఉన్నారు.

## 4న 'సురక్షా దివస్'

ఆసిఫాబాద్‌అర్బన్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 4న జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్ క్వార్టర్‌లో పోలీసుశాఖ ఆధ్వర్యంలో సురక్షా దివస్ నిర్వహించనున్నట్లు ఎస్పీ సురేశ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు ప్రజల సందర్శనం కోసం ఏడు స్టాల్స్‌ను కలెక్టర్, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభిస్తామని పేర్కొన్నారు. సైబర్ క్రైం, షీటీం, ఫింగర్ ప్రింట్ విభాగం, డాగ్ స్క్వాడ్, కళాబృందం, బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్ ఈ దశాబ్ద కాలంలో సాధించిన ప్రగతిపై వీడియో ప్రదర్శన ఉంటుందన్నారు. అనంతరం సమాజ సేవ చేస్తున్న పౌరులు, ఉత్తమ ప్రతిభ చూపిన పదో తరగతి విద్యార్థులు, పోలీసు సిబ్బందిని కొంతమందిని సన్మానిస్తామని తెలిపారు. పోలీసు వాహనాలు, బృందాలతో పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 6 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు, అతిథుల ఉపన్యాసాలు ఉంటాయని వెల్లడించారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## ఊరూవాడా.. రైతు వేడుక

- రైతు దినోత్సవం నిర్వహణకు 70 రైతు వేదికల్లో ఏర్పాట్లు
- దాదాపు 70 వేల మందితో సహపంక్తి భోజనాలు
- ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో ర్యాలీలు

సాక్షి, ఆసిఫాబాద్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా ప్రారంభించిన జిల్లా యంత్రాంగం శనివారం జరిగే రైతు దినోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించేందుకు సన్నద్ధమైంది. జిల్లా వ్యాప్తంగా 15 మండలాల్లోని 70 రైతు వేదికల వద్ద అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఇప్పటికే వేదికలను విద్యుత్ దీపాలు, పూలు, మామిడి, ఆరటి తోరణాలతో అలంకరించారు. తహసీల్దార్, ఎంపీడీవో, అగ్రికల్చర్, పంచాయతీ అధికారుల సమన్వయంతో వేడుకలు అట్టహాసంగా నిర్వహించనున్నారు.

**ర్యాలీతో ప్రారంభం..**

రైతాంగం గర్వపడేలా నిర్వహించనున్న వేడుకల్లో భాగంగా ఎడ్లబండ్లు, ట్రాక్టర్లను అలంకరించుకుని డీజేలతో రైతు వేదికల వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. ఆయా పంచాయతీల్లో ప్రధాన కేంద్రాల నుంచి ఈ ర్యాలీ ప్రారంభమవుతుంది. మెరుగైన వ్యవసాయ పద్ధతులు, పంటల మార్పిడి, కొత్త వంగడాల గురించి రైతులకు అధికారులు వివరిస్తారు. రైతుల తమ అనుభవాలను పంచుకుంటారు. అనంతరం రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలపై అవగాహన కల్పిస్తారు. అనంతరం ఆదర్శ రైతులందరినీ సన్మానించనున్నారు.

**రూ.80 లక్షల ఖర్చు..**

ఉత్సవాలకు రైతులు, అధికారులు ఇతర సిబ్బంది కలిసి సుమారు 70 వేల మందికి పైగా హాజరవుతారని అధికారులు అంచనా వేశారు. వారికి సహపంక్తి భోజనాలు చేయనున్నారు. చికెన్ రైస్, సాంబారు, మజ్జిగ అందించనున్నారు. ఇందుకోసం ఏకంగా రూ.80 లక్షలు ఖర్చు చేస్తున్నారు. వేడుకలకు హాజరయ్యే ఏ ఒక్కరికీ భోజనం అందలేదన్న మాట రాకుండా చూడాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అధికారులను ఆదేశించారు.



విద్యుత్ కాంతుల్లో కౌటాల రైతు వేదిక

**పోలీసు బందోబస్తు.. మెడికల్ టీం**

ర్యాలీ జరిగే సమయం నుంచి వేడుకలు ముగిసే వరకు ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. స్థానిక పోలీసుస్టేషన్ అధికారులతో మాట్లాడి బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రతీ వేదిక వద్ద ఒక మహిళా కానిస్టేబుల్, మెడికల్ టీంను కూడా అందుబాటులో ఉంచాలన్నారు.

**జిల్లాలోని రైతు వేదిక ప్రాంతాలు**

జిల్లాలో బెజ్జూర్ మండలంలో బెజ్జూర్, కుకుడా, ఊట్‌సారంగపల్లి, సోమిని గ్రామాలు.. పెంచికల్‌పేట్ మండలంలోని పెంచికల్‌పేట్, చేడ్వాయి, కమ్మర్‌గాం, ఆసిఫాబాద్ మండలంలోని జనక్కాపూర్, బైరుగూడ, రహపల్లి, బాబాపూర్, చిర్రకుంట, వావ్‌డాం, దహెగాం మండలంలోని దహెగాం, కోత్మీర్, బీబ్రా, కుంచవెల్లి, గిరివెల్లి, మెట్లగూడ, జైనూర్ మండలంలోని జెండాగూడ, ఉషేగాం, గౌరీ, రాశిమెట్ట, సిర్పూర్(యూ) మండలంలోని మహాగాం, పంగిడి, సిర్పూర్(యూ), లింగాపూర్ మండలంలోని లింగాపూర్, కంచన్‌పల్లి, కెరమెరి మండలంలోని కెరమెరి(కేస్లాగూడ), అనార్‌పల్లి, ధనోరా, సాంగ్వి, ఖైరీ, చింతలమానెపల్లి మండలంలోని బాలాజీ అనుకోడ, బాబాసాగర్, కోర్సిని, గూడెం, రుద్రాపూర్, డబ్బా, వాంకిడి మండలంలోని వాంకిడి, బంబార, కోమటిగూడ, కన్నెరగాం, ఇంధాని, సోనాపూర్, ఖమానా, బెండార, రెబ్బెన మండలంలోని గంగాపూర్, కైరిగాం, నారాయణ్‌పూర్, తక్కలపల్లి, సిర్పూర్(టి) మండలంలోని సిర్పూర్, వేంపల్లి, చింతకుంట, లోనవెల్లి, కౌటాల మండలంలోని కౌటాల, ముత్తంపేట్, మొగడ్‌దగడ్, గుండాయిపేట్, సాండ్‌గాం, గురుడుపేట్, గుడ్లబోరి, తిర్యాణి మండలంలోని చింతపల్లి(తిర్యాణి), గిన్నెదరి, పంగిడిమదార, మాణిక్యపూర్, మంగీ, కాగజ్‌నగర్ మండలంలోని వంజిరి, జంబుగూడ, దుర్గానగర్ (కాగజ్‌నగర్), చింతగూడ గ్రామాల్లోని రైతు వేదికల్లో సంబురాలు నిర్వహించనున్నారు.

## క్లుప్తంగా

### నిషేధిత పత్తి విత్తనాల పట్టివేత



నకిలీ విత్తనాలు చూపుతున్న ఏడీఏ సురేఖ

తాండూర్: మండలంలో శుక్రవారం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయశాఖ అధికారులు ఓ వ్యక్తి వద్ద ప్రభుత్వ నిషేధిత పత్తి విత్తనాలు పట్టుకున్నారు. పక్కా సమాచారంతో తాండూర్‌కు చెందిన అల్లె నరేశ్ అలియాస్ నారాయణ వద్ద 15కిలోల నకిలీ విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. వీటిని తాండూర్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఐపీవోలు అనిల్‌కుమార్, వరుణ్‌ప్రమోద్, విజిలెన్స్ తహసీల్దార్ దినేశ్ చంద్ర, అధికారులు ఎం.అనిల్‌కుమార్, పీసీ సంపత్‌కుమార్, బెల్లంపల్లి ఏడీఏ సురేఖ, ఏవో కిరణ్మయి, సిబ్బంది ఉన్నారు.

### ట్రాక్టర్ బోల్తా పడి యువకుడి మృతి

కౌటాల: మండలంలోని బోదంపల్లి గ్రామానికి చెందిన మోర్లె రాజేందర్ (20) అనే యువకుడు ట్రాక్టర్ బోల్తా పడి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మోర్లె పున్నయ్య-సావిత్రి దంపతులకు ముగ్గురు కుమారులు. చిన్నకుమారుడు రాజేందర్ కౌటాలలోని ట్రాక్టర్ గ్యారేజీలో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం బోదంపల్లి గ్రామానికి చెందిన యాటకారి కమలాకర్‌కు చెందిన ట్రాక్టర్‌ను డ్రైవర్ పిడుగు వినోద్ గ్రామ శివారులో దుక్కి దున్నడానికి తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో తన స్నేహితుడు పిడుగు సాయితో కలిసి రాజేందర్ ట్రాక్టర్‌పై వెళ్లాడు. దుక్కి దున్ని ముగ్గురు ఇంటికి వస్తున్న క్రమంలో ట్రాక్టర్‌ను ఒడ్డు ఎక్కించే క్రమంలో బోల్తాపడింది. దీంతో మోర్లె రాజేందర్‌పై ట్రాక్టర్ పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ వినోద్ కాలు విరిగింది. సాయికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగ్రాతులను కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. రాజేందర్ తల్లిదండ్రులు మృతదేహంపై పడి బోరున విలపించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు.

### గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

భీమిని: మండలంలోని తంగెళ్లపల్లి-వెంకటాపూర్ గ్రామాల మధ్య శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. వివరాలు.. తంగెళ్లపల్లి గ్రామానికి చెందిన రత్నం నాన్నయ్య (60) చీపురు కట్టలు అమ్ముకోవడానికి సూర్జాపూర్ గ్రామానికి నడిచి వెళ్తున్నాడు. ఈ క్రమంలో తంగెళ్లపల్లి-వెంకటాపూర్ గ్రామాల మధ్య గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కుమారుడు వెంకటేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కన్నెపల్లి ఎస్సై నరేశ్ తెలిపారు.



# పరిహారం కోసమే పక్కా ఇళ్లు

బెల్లంపల్లి/తాండూర్: బెల్లంపల్లి ఏరియా మాదారం ప్రాంతంలో సింగరేణి ప్రతిపాదించిన మహావీర్ ఖని (ఎంవీకే) ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్ బొగ్గు తవ్వకాల అనుమతుల కోసం ఓ వైపు ప్రయత్నం జరుగుతుండగా మరోవైపు పరిహారం కోసం పక్కా ఇళ్ల నిర్మాణం జోరందుకుంది. గ్రామపంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడుతున్నారు. అక్రమ ఇళ్ల నిర్మాణాలను అడ్డుకోకపోవడం, పైగా వాటికి నంబర్లు కేటాయించడం అనుమానాలకు తావిస్తోంది.

- మహావీర్‌ఖని ఓసీపీ ప్రభావిత ప్రాంతంలో జోరుగా ఇళ్ల నిర్మాణాలు
- అక్రమంగా ఇంటినంబర్ల కేటాయింపు
- పరిహారం రాదంటున్న అధికారులు
- పరారీలో ఓ పంచాయతీ కార్యదర్శి
- అన్ని వైపులా ఒత్తిళ్లే కారణం
- అక్రమాలపై అధికారుల విచారణ



ఎంవీకే ఓసీపీ ప్రభావిత ప్రాంతంలో నిర్మించిన ఇళ్లు

**రెండేళ్లుగా కొనసాగుతున్న తంతు**

మహావీర్ ఖని ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు పరిధిలో మాదారం, మాదారం త్రీ ఇంక్లైన్, నీలాయపల్లి, తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కొంతభాగం ప్రభావిత ప్రాంతాలుగా సింగరేణి యాజమాన్యం గుర్తించింది. సింగరేణి ప్రతిపాదించిన ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీ భూములపై కొందరు కన్నేశారు. రెండేళ్లుగా ప్రభావిత భూభాగంలో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. రైతుల నుంచి తక్కువ ధరకు భూమి కొనుగోలు చేసి ఇళ్లు నిర్మిస్తున్నారు. ఇంకొంత మంది రైతులతో ఒప్పందం చేసుకుని వందల సంఖ్యలో నిర్మాణాలు చేపట్టారు. పోచంపల్లి గ్రామశివారులో అసైన్డ్ భూమిలోనూ ఇళ్లు నిర్మించారు. వీటిలో సగానికి పైగా ఇళ్లకు నంబర్లు కూడా తీసుకున్నారు. ఈ వ్యవహారంలో భారీగానే డబ్బులు చేతులు మారినట్లు ప్రచారంలో ఉండగా నేటికీ ఇళ్ల నిర్మాణాలు ఆగకపోవడం గమనార్హం.

### కొత్త ఇళ్లకు అనుమతి లేదు



ఎంవీకే ఓసీపీ ప్రతిపాదిత ప్రాంతాల్లో కొత్తగా నిర్మించిన ఇళ్లకు గ్రామపంచాయతీ నుంచి అనుమతి ఇవ్వబోం. ఇంటి నంబర్లు కేటాయించం. ఇప్పటికే కొత్త ఇళ్లకు కేటాయించిన నంబర్లను రద్దు చేస్తాం. ప్రాథమిక విచారణలో 50కి పైబడి ఇళ్లకు నంబర్లు కేటాయించినట్లు గుర్తించాం. సదరు పంచాయతీ కార్యదర్శిపై విచారణ జరుపుతాం. ప్రస్తుతం ఆ కార్యదర్శి పరారీలో ఉన్నారు. సింగరేణి నుంచి అధికంగా పరిహారం పొందాలనే ఉద్దేశంతోనే ఇబ్బడిముబ్బడిగా ఇళ్లు నిర్మిస్తున్నారు. అయితే రికార్డుల్లో నమోదైన ఇళ్లకు మాత్రమే పరిహారం అందించే అవకాశముంది.

– ఎ.ఫణీందర్‌రావు, డీఎల్పీవో, బెల్లంపల్లి

**పరారీలో పంచాయతీ కార్యదర్శి**

ఇష్టారీతిన కడుతున్న ఇళ్ల నిర్మాణాలను అడ్డుకోకుండా నిబంధనలకు విరుద్ధంగా ఇంటి నంబర్లు కేటాయించడంలో ఓ గ్రామపంచాయతీ కార్యదర్శి కీలకంగా వ్యవహరించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు పలుసార్లు హెచ్చరించినట్లు తెలుస్తోంది. అయినా బేఖాతరు చేసి ఇంటి నంబర్లు కేటాయించారు. సదరు పంచాయతీ కార్యదర్శికి అన్ని వైపులా ఒత్తిళ్లు రావడంతో ఇటీవల పరారైనట్లు తెలుస్తోంది. అతడి అక్రమాలపై ప్రస్తుతం విచారణ చేస్తున్నట్లు సమాచారం. కొత్తగా మరో పంచాయతీ కార్యదర్శికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టకుండా ఈపాటికే రెండుసార్లు డీపీవో నుంచి ఉత్తర్వులు జారీ చేసినా మార్పు రావడం లేదు.

### పరిహారం ఆశతోనే నిర్మాణాలు

ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్ కింద భూములు కోల్పోయిన రైతులకు సింగరేణి యాజమాన్యం పరిహారం చెల్లిస్తుంది. ఖాళీగా ఉన్న భూములకు ప్రస్తుత మార్కెట్ విలువ అంచనా వేసి పరిహారం ఇస్తుంది. ఖాళీ భూమి కన్నా ఇళ్లు, వృక్షాలు, సాగుభూములకు అధికమొత్తంలో పరిహారం చెల్లించే అవకాశముంది. ప్రస్తుతం ప్రతిపాదిత ఓసీపీ ప్రాంతంలో ఖాళీ భూములే అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. కొంతమంది రైతులు కొద్దిపాటి విస్తీర్ణంలో ఆరుతడి పంటలు సాగు చేస్తుండగా చాలావరకు పడావుగా ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల్లో నమోదైనట్లు సమాచారం. అయితే సింగరేణి యాజమాన్యం ఎంవీకే ఓసీపీని తెరమీదికి తీసుకురాగానే మాదారం త్రీ ఇంక్లైన్, నీలాయపల్లి, మాదారం గ్రామపంచాయతీల పరిధిలోని ఖాళీ భూముల్లో పోటాపోటీగా కొత్త ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. పరిహారం చెల్లింపు విషయంలో సింగరేణి అధికారులు ఈపాటికే క్లారిటీ ఇచ్చినా అక్రమ కట్టడాలు ఆగడం లేదు. గ్రామపంచాయతీ, రెవెన్యూ రికార్డుల్లో కొన్నేళ్ల క్రితం నమోదై ఉన్న ఇళ్లు, పంట భూములు, ఇతర స్థలాలకు మాత్రమే పరిహారం చెల్లిస్తామని, కొత్తగా నిర్మిస్తున్న ఇళ్లకు పరిహారం రాదని స్పష్టం చేసినా నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

### గొర్రెలు మేపడం ఇష్టంలేక యువకుడి ఆత్మహత్య



కుమార్ మృతదేహం

దండేపల్లి: మండలంలోని కాసిపేటకు చెందిన యువకుడు గొర్రెలు మేపడం ఇష్టం లేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కాసిపేటకు చెందిన అల్లంల మల్లయ్య గొర్రెల కాపరి. తన కొడుకు కుమార్‌ను (24) గొర్రెలను మేపుకరావాలని పలుసార్లు కోరాడు. కానీ.. కుమార్‌కు గొర్రెలు మేపడం ఇష్టం లేదు. గురువారం కూడా గొర్రెలను మేపుకరావాలని మల్లయ్య కోరగా కుమార్ ఇంట్లోనే ఉన్నాడు. మనస్తాపానికి గురైన అతడు ఇంట్లోని గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని వెంటనే లక్సెట్టిపేట ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించగా కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**మద్యం తాగొద్దని మందలించినందుకు బాలుడు..**



సంతోష్ మృతదేహం

తిర్యాణి: మద్యం తాగొద్దని కుటుంబసభ్యులు మందలించగా మనస్తాపంతో బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని అమీన్‌గూడ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. సొల్లు పోశం-రాజక్క దంపతుల రెండో సంతానమైన సంతోష్ (16) గ్రామంలో కూలీ పనులకు వెళ్తుంటాడు. వచ్చిన డబ్బులతో మద్యం సేవిస్తూ ఇంట్లో తరచూ గొడవపడేవాడు. గురువారం రాత్రి 9 గంటల సమయంలో మద్యం తాగి ఇంటికి వచ్చాడు. డబ్బులు కావాలని కుటుంబ సభ్యులతో గొడవకు దిగాడు. దీంతో వారు మద్యం మానేయాలని మందలించగా మనస్తాపంతో రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. ఎంతసేపైనా రాకపోవడంతో శుక్రవారం ఉదయం వెతకగా గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. మృతుడి తండ్రి పోశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత



మందమర్రిరూరల్: మొబైల్ ఇస్తున్న ఎస్సై



నస్పూర్: మొబైల్ అప్పగిస్తున్న ఎస్సై రాజేశ్

మందమర్రిరూరల్: కొద్దిరోజుల క్రితం రామకృష్ణాపూర్‌కు చెందిన పందుల రవి తన మొబైల్‌ను ఎక్కడో పోగొట్టుకున్నాడు. మందమర్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్‌ను గుర్తించారు. శుక్రవారం ఎస్సై చంద్రకుమార్ బాధితుడిని స్టేషన్‌కు పిలిపించి మొబైల్ అప్పగించారు. సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకుంటే మొబైల్ ఫోన్‌ని తిరిగి పొందే అవకాశం ఉందని తెలిపారు.

**శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్‌లో..**

నస్పూర్: శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్తరోడ్డుకు చెందిన కోలుగురి పూజ ఇటీవల తన మొబైల్‌ను పోగొట్టుకుంది. శ్రీరాంపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించారు. ఎస్సై రాజేశ్ శుక్రవారం బాధితురాలికి మొబైల్ అప్పగించారు. మొబైల్ ఫోన్లను గుర్తించడానికి టెక్ టీం హెడ్ కానిస్టేబుల్ చంద్రమోహన్, బ్లూ కోల్ట్స్ హెడ్‌కానిస్టేబుల్ సంపత్ కృషి చేశారని తెలిపారు.

# రోడ్డు విస్తరణకు సహకరించాలి



భూయజమానితో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీలో రోడ్ల వెడల్పు కోసం చేస్తున్న అభివృద్ధి పనులు, రోడ్డు వెడల్పు పనులకు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య కోరారు. జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తాలో తన స్థలం నుంచి వేసిన రోడ్డును ఇటీవల భూయజమాని ఫెన్సింగ్ వేసి మూసివేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో శుక్రవారం సాయంత్రం మున్సిపల్ చైర్మన్ ఆధ్వర్యంలో వైస్ చైర్మన్ గాజుల ముఖేశ్‌గౌడ్, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్, మున్సిపల్ ఇంజినీర్ మధుకర్ భూయజమానిని కలిసి రోడ్డు వెడల్పునకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా భూయజమాని విజయ్‌మోహన్ మాట్లాడుతూ.. 45 ఏళ్లుగా తమ భూమికి సంబంధించి వివాదం ఉందని, తమ తండ్రి రామ్మోహన్‌రావు అడ్వకేట్ కావడంతో దీనిపై కోర్టుకు వెళ్లారని తెలిపారు. ఈ సమస్యకు కోర్టు పరిహారం ఇవ్వాలని తీర్పునిచ్చిందని గుర్తు చేశారు. రోడ్డు వెడల్పు విషయంలో తాము సహకారం అందిస్తున్నా తమకు అందించాల్సిన పరిహారం విషయంలో మాత్రం తాత్సారం చేస్తున్నారని తెలిపారు. అందుకే తమ స్థలంలోని హద్దుల్లో ఫెన్సింగ్ వేయాల్సి వచ్చిందని చెప్పారు. మార్కెట్ విలువ గజానికి రూ.15వేలు ఉండగా, బహిరంగ మార్కెట్‌లో రూ.1.50 లక్షల వరకు ఉందని తెలిసిందన్నారు. తనకు పరిహారం ఇస్తే భూమి ఇచ్చేందుకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. చైర్మన్ వెంట కౌన్సిలర్లు మినాజొద్దీన్, వేముల సంజీవ్, గాదె సత్యం, పోరెడ్డి రాజు, మోతె సుజాత తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ భవన్‌లో 'గుస్సాడీ' ప్రదర్శన



గుస్సాడీ బృందాన్ని సన్మానిస్తున్న తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి జగన్నాథం, భవన్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్

నార్నూర్(ఆసిఫాబాద్): జైనూర్ మండలం మార్లవాయి గ్రామానికి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత కనక రాజు గుస్సాడీ బృందానికి అరుదైన గౌరవం దక్కింది. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ప్రదర్శన ఇచ్చారు. తెలంగాణ భవన్ వీరికి ప్రత్యేకంగా ఆహ్వానం పంపడంతో హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీ వెళ్లారు. సాయంత్రం 4 గంటలకు ఆదివాసీ నృత్యాలతోపాటు గుస్సాడీ నృత్యం, సంప్రదాయ వాయిద్యాలను ప్రదర్శించినట్లు బృందం కోఆర్డినేటర్ కనక వెంకటేశ్వర్‌రావు తెలిపారు. కాగా, గుస్సాడీ బృంద సభ్యులను తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి మందా జగన్నాథం, భవన్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ ఘనంగా సన్మానించారు. జ్ఞాపికలను ప్రదానం చేశారు. గుస్సాడీ టీం రిసోర్స్ పర్సన్ కనక సుదర్శన్, సభ్యులు గేడం శ్రీధర్, జుగ్నాక ధర్మేందర్, మడవి మధురాజ్, ఆత్రం నూతన్, జుగ్నాక సోనేరావు, గేడం శంకర్, జుగ్నాక నందు, కనక రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

# అట్టహాసంగా ఆవిర్భావ వేడుకలు



రామకృష్ణాపూర్: తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న అధికారులు, నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణి ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నస్పూర్ కాలనీలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. జీఎం కార్యాలయం వద్ద తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, కంపెనీ అధికారులు, యూనియన్ నేతలు నివాళులర్పించారు. జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం జీఎం కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. జీఎం సతీమణి, సేవా అధ్యక్షురాలు రాధాకుమారి, ఇన్‌చార్జి ఎస్వోటూ జీఎం గోపాల్‌సింగ్, గుర్తింపు సంఘం ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు అబ్దుల్ ఖాదీర్, ఏరియా ఇంజినీర్ రమేశ్‌బాబు, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, డీజీఎంలు అరవింద్‌రావు, చిరంజీవి, శివరావు, చంద్రశేఖర్‌రెడ్డి, టీబీజీకేఎస్ నాయకులు మల్లారెడ్డి, లక్ష్మణ్, కుమారస్వామి, సేవా కార్యదర్శి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

**రామకృష్ణాపూర్‌లో..**

రామకృష్ణాపూర్: పట్టణంలోని సింగరేణి ఠాగూర్‌స్టేడియంలో మందమర్రి జీఎం మోహన్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. సూపర్‌బజార్ సెంటర్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. రామాలయంలోని అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య, క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, యూనియన్ నాయకులు మేడిపెల్లి సంపత్, అక్బర్‌అలీ, బీ ఆర్ ఎస్ నాయకులు అబ్దుల్‌అజీజ్, గాండ్ల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు. క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయం, ఆర్కేపీ గనులు, ఆయా పార్టీల కార్యాలయాల్లోనూ వేడుకలు నిర్వహించారు.

**ఎస్టీపీపీలో..**

జైపూర్: మండల కేంద్రంలోని 1200 మెగావాట్ల సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ఎస్టీపీపీ అడ్మిన్ భవన కార్యాలయం వద్ద వేడుకలు నిర్వహించారు. ఎస్టీపీపీ ముఖ్య సలహాదారు సంజయ్‌కుమార్ సూర్ జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి సీఎండీ శ్రీధర్ నేతృత్వంలో నిరంతరం జైపూర్ ఎస్టీపీపీ నుంచి విద్యుత్ ఉత్పత్తి చేస్తూ రాష్ట్రానికి అందిస్తున్నట్లు తెలిపారు. జీఎం సూర్యనారాయణరాజు, ఓఅండ్ఎం చీఫ్ జెన్‌సింగ్, ఇన్‌చార్జి పీసీఎస్ జీఎం ఎంఎస్వీ రమణ, ఉద్యోగుల సంఘం కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు సముద్రాల శ్రీనివాస్, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు చుక్కల శ్రీనివాస్, ఏజీఎంలు సత్యనారాయణ ప్రసాద్, సుధాకర్, శ్రీనివాసులు, డీజీఎం కేసానారాయణరావు, పీఎం రామశాస్త్రి, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

**బెల్లంపల్లి ఏరియాలో..**

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో ఏరియా జీఎం దేవేందర్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం సింగరేణి గణనీయంగా అభివృద్ధి చెందిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక చొరవతో ఉద్యోగులకు అనేక హక్కులు కల్పించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్వోటూ జీఎం గుప్తా, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్, పర్సనల్ మేనేజర్ లక్ష్మణ్‌రావు, ఏజీఎం తిరుమల్‌రావు, డీజీఎం సతీశ్ బాబు తదితరులు పాల్గొన్నారు.



గోలేటిలో జెండాకు వందనం చేస్తున్న జీఎం



శ్రీరాంపూర్: కేక్ కట్ చేస్తున్న జీఎం దంపతులు



జైపూర్: జెండా ఆవిష్కరిస్తున్న సంజయ్‌కుమార్‌సూర్

# డంప్‌యార్డు పొగతో ఉక్కిరి బిక్కిరి

- మూడ్రోజులుగా వ్యాపిస్తున్న పొగ
- పట్టించుకోని అధికారులు



ఇండ్లలో కమ్ముకుంటున్న పొగ



డంప్‌యార్డు నుంచి వ్యాపిస్తున్న పొగ

చెత్త కుప్పలకు నిప్పంటించకుండా నిఘా పెట్టడంతోపాటు

బెల్లంపల్లి: మున్సిపల్ అధికారులు, పాలకుల పట్టింపులేని తనంతో పురప్రజలు పొగతో సతమతమవుతున్నారు. గడిచిన మూడురోజుల నుంచి వరుసగా ఎత్తివేతకు గురైన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పక్కన ఉన్న డంప్‌యార్డులో ఉన్న చెత్తకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో పొగ వ్యాపిస్తోంది. ఓ పక్క డంప్‌యార్డు చెత్త కుప్పల్లో మంటలు వ్యాపించగా అంతే తీవ్రతతో పొగ వ్యాపిస్తూ సమీప ఇళ్లలోకి చేరుతోంది. దీంతో శ్వాస తీసుకోవడానికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. చిన్నారులు, వృద్ధులు, శ్వాసకోస సంబంధ సమస్యలున్నవారు పొగతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. చీకటి కాగానే డంప్‌యార్డులో మంటలు వ్యాపించడం, ఆ తర్వాత పొగ కమ్ముకోవడం వరుసగా మూడురోజులుగా కొనసాగుతోంది. కొత్త బస్టాండ్ ఏరియా, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంతం, కన్నాల బస్తీ, మధునన్ననగర్, టేకుల బస్తీ, ఫుట్‌గ్రౌండ్ బస్తీ, పాత బస్టాండ్ ఏరియా, కాంట్రాక్టర్ బస్తీ, రవీందర్‌నగర్, షంషీర్‌నగర్, బజారు ఏరియా తదితర ప్రాంతాల్లో పొగ ప్రభావం ఉంటోంది. రెండు నెలల క్రితం ఇదే తీరుగా డంప్‌యార్డులో మంట రాజుకుని తీవ్రమైన పొగ వ్యాపించగా స్థానికులు ఎంతో అసౌకర్యానికి గురయ్యారు. సమీప ఇళ్ల ప్రజలు పొగ ప్రభావంతో భోజనం చేయలేని పరిస్థితులు చవిచూశారు. స్థానికులు ఆందోళనకు సిద్ధమవుతున్న క్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ డంప్‌యార్డు నుంచి పొగరాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విరమించారు. ఆ ప్రాంతంలో చెత్త కుప్పలకు నిప్పంటించకుండా నిఘా పెట్టడంతోపాటు చెత్తాచెదారాన్నీ పడేయకుండా చర్యలు తీసుకుంటామని స్థానికులకు హామీ ఇచ్చి విస్మరించారు. ఎప్పటిమాదిరిగానే డంప్‌యార్డు నుంచి పొగ వ్యాపించగా భరించలేకపోతున్నారు. మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్ ఇతర ప్రజాప్రతినిధుల దృష్టికి స్థానికులు సమస్యను తీసుకువెళ్లినా స్పందించడంలేదనే ఆరోపణలున్నాయి. వీరు అనుసరిస్తున్న తీరుతో తీవ్ర ఆగ్రహావేశాలకు లోనవుతున్నారు. డంప్‌యార్డులో మంటలు లేవకుండా, పొగ వ్యాపించకుండా తక్షణ చర్యలు తీసుకుని శాశ్వత ప్రాతిపదికన డంప్‌యార్డును మరో ప్రాంతానికి తరలించాలని ఈ ప్రాంత ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.